క్లుప్తంగా

ప్రశంసా పత్రాలు అందజేత



పెడన: ఆధార్ సేవలను ఉత్తమంగా అందించిన ఆరుగురికి ప్రశంసా పత్రాలను అందజేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన స్టేట్ ఆధార్ మీటింగ్‌లో స్టేట్ కమిషనర్ రామ్‌నాథ్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఆధార్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ తూము లక్ష్మణ్, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు కె. రామారావు, ఎస్ అభినయ్, షేక్ అబ్దుల్ రెహమాన్, ఆర్. జగదీష్, ఎం. కిషోర్‌బాబు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

దుర్గా నాగేశ్వరస్వామి సన్నిధిలో ప్రముఖులు



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారిని అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జి కె. విజయ కల్యాణి దంపతులు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దంపతులు, మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డీఎంహెచ్‌ఓ జి గీతాబాయి విడివిడిగా శనివారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారికి ఆలయ ప్రధానార్చకులు శంకరమంచి భాస్కర విజయకుమార్, బుద్దు నాగవరప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి లడ్డుప్రసాదాలు అందచేశారు. వీరితో పాటు స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ అరజా లక్ష్మీతులసి, గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్రాజు మృతికి ఎమ్మెల్యే పేర్ని నాని సంతాపం



మచిలీపట్నంటౌన్: రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు మృతికి ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సంతాపం తెలిపారు. సర్రాజు మృతి వార్త తెలిసిన వెంటనే భీమవరంలోని పెదఅమిరానికి వెళ్లి సర్రాజు పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బాలకోటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ. 1.61 లక్షలు

పాతఎడ్లంక(అవనిగడ్డ): పాత ఎడ్లంకలో వేంచేసియున్న బాలకోటేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకలను శనివారం లెక్కించారు. ప్రతి ఏటా శివరాత్రికి హుండీ కానుకలను లెక్కిస్తారు. హుండీ ఆదాయం రూ.1,61,699 వచ్చినట్టు దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ దారుడు కె. శ్రీనివాసరావు తెలిపారు. గత ఏడాది కంటే రూ.30,012 అధిక ఆదాయం లభించిందని చెప్పారు. కార్యక్రమాన్ని ఆలయ పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

బందరు సబ్‌-డివిజన్‌లో 30 పోలీస్ యాక్టు అమలు

కోనేరుసెంటర్: బందరు సబ్–డివిజన్ పరిధిలో ఈ నెల 18 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని బందరు డీఎస్పీ మాసూంబాషా తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఏ ఒక్కరు సభలు, సమావేశాలు, ధర్నాలు, నిరసన దీక్షలు, బహిరంగ ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. చట్టవిరుద్ధంగా ఎవరైనా అలాంటి కార్యక్రమాలు తలపెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమాలు నిర్వహించదలచిన వారు ముందుగా సబ్ డివిజినల్ అధికారి నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పోలీసుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా కార్యక్రమాలు తలపెడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నంటౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) కృష్ణా జిల్లా కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో శనివారం సమావేశం జరిగింది. సంఘ జిల్లా చైర్మన్ బి. లంకేష్, ప్రధాన కార్యదర్శి బి. అశోక్‌కుమార్ మాట్లాడుతూ డీఈఓ ఉపాధ్యాయుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర నాయకులు రావెళ్ల వరుణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హర హర మహాదేవ

- భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు
- ప్రత్యేక అలంకారాల్లో శోభిల్లిన లింగాకారులు
- ప్రత్యేక పూజలు, పితృ దేవులకు పిండ ప్రదానాలు



పెదకళ్లేపల్లి ఆలయం వెలుపల భక్తజన సందోహం

కోడూరు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. శనివారం ఉదయం నుంచే స్వామివార్ల దర్శనం కోసం భక్తులు ఆలయాల వద్ద క్యూ కట్టారు. లింగారెడ్డిపాలెంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి లింగాకారుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను భక్తిప్రపత్తులతో నిర్వహించి, నాగాభరణాన్ని అలంకరించారు. వేణుగోపాలపురంలోని అంబికా సమేత అమరలింగేశ్వరస్వామివారి ఆలయంలోని 108 శివ లింగాలకు మహిళలు విశేష పూజలు చేశారు. హంసలదీవి, విశ్వనాథపల్లిలోని కాశీవిశ్వేశ్వరస్వామి, మాచవరంలోని రామలింగేశ్వరస్వామి, సాలెంపాలెంలోని అగస్తేశ్వరస్వామి, పిట్టల్లంకలోని బాలనాగేశ్వరస్వామి వారి ఆలయాల్లో శివరాత్రి పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీల నిర్వాహకులు, గ్రామ ప్రముఖులు పర్యవేక్షించారు.

పడవలపై శివరాత్రి ఉత్సవాలకు..

కోడూరు: పెదకళ్లేపల్లిలో జరిగిన శివరాత్రి ఉత్సవాలకు మండల ప్రజలు కృష్ణానదిపై పడవ ప్రయాణం చేస్తూ వెళ్లారు. కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాల ప్రజలు సహజంగా పెదకళ్లేపల్లికి మోపిదేవి మీదుగా ద్విచక్ర వాహనాలపై వెళ్లాల్సి ఉంది. రోడ్డు మార్గం ద్వారా వెళ్లడం వల్ల సుమారు 10 కిలోమీటర్ల మేర దూరం పెరగడంతో ప్రజలంతా మండలంలోని పిట్టల్లంక పడవల రేవు మీదుగా ప్రయాణాలు సాగిస్తారు. పెదకళ్లేపల్లి కృష్ణానది ఒడ్డునే పితృ దేవతల పిండ ప్రదానాలు కూడా ఉండడంతో రెవెన్యూ, పోలీస్ శాఖల పర్యవేక్షణలో పడవ ప్రయాణాలకు అనుమతిచ్చారు. ఒక్కో పడవలో సుమారు 20 మందిని ఎక్కించుకొని మత్స్యకారులు నదిపై రాకపోకలు సాగించారు.


కృష్ణాతీరంలో పితృ దేవతలకు పిండ ప్రదానం

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పితృదేవతలను స్మరిస్తూ కుటుంబీకులు కృష్ణాతీరంలో పిండ ప్రదానాలు చేశారు. ఉల్లిపాలెం పుష్కరఘాట్ వద్ద పిండ ప్రదానాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నది ఒడ్డునే పురోహితులు పితృదేవతల పేరు మీద కర్మలు జరిపారు. అనంతరం బ్రహ్మణులకు పొత్తర్లు సమర్పించి, పిండప్రదానం చేసి వీటిని నదిలో కలిపి తమ పూర్వీకులను స్మరించుకున్నారు.

- పెడన: పెడన పట్టణంలోని గంగాపార్వతీ సమేత అగస్తేశ్వరస్వామి ప్రధాన శివాలయానికి వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. అన్నదాన కమిటీ సుమారు మూడు వేల మందికిపైగా భారీ అన్నసమారాధన చేశారు. 17వ వార్డులోని పోలవరపుపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో, 23వ వార్డులోని సదాశివలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నసమారాధన నిర్వహించారు.

ఆకట్టుకున్న ప్రభలు

పాతఎడ్లంక(అవనిగడ్డ): పాత ఎడ్లంక బాలకోటేశ్వ రస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పశుపోషకులు తమ పశువులను ఆలయంచుట్టూ తిప్పి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కెప్టెన్ లక్ష్మీ దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ, పులిహోర పంపిణీని ప్రారంభించారు. కృష్ణానది ఒడ్డున పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పితృ దేవతలకు పిండ ప్రదానం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రత్యేక ప్రభలు విశేష ఆకర్షణగా నిలిచాయి. ప్రభల ముందు యువకులు నృత్యం చేస్తూ సందడి చేశారు. డప్పువాయిద్యాలు, మేళతాళాలతో ప్రభలను ఆలయం చుట్టూ తిప్పి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎడ్లంకకు చెందిన యువకులు అంబేడ్కర్, పూలే చిత్రపటాలతో చేసిన ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మునిపల్లి వెంకటేశ్వరరావు, పలువురు నేతలు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.



స్వయంభుగా వెలసిన నాగేశ్వరస్వామి వారు

స్వచ్ఛంద సంస్థల సేవలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి భక్తజనంతో కిటకిటలాడింది. తెల్లవారుజామున రెండు గంటల నుంచే స్వామివారి దర్శనానికి అనుమతించడంతో ఆలయంలోని క్యూ లైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ ఏసీ ఎన్ సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు అందించారు. దేవదాయ అధికారులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత భోజనం, మజ్జిగ, మంచినీరు అందజేశారు. స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో 20 వేల మందికి అన్నదానం, మచిలీపట్నం వాస్తవ్యులు సుధా స్టూడియో ఆధ్వర్యంలో 5 వేల మందికి అన్నదానం, చల్లపల్లి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పులిహోర, యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో మజ్జిగ, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూల్ డ్రింక్స్ భక్తులకు ఉచితంగా అందజేశారు. కె. కొత్తపాలెం దుర్గాకోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంత్రి జోగి పట్టువస్త్రాలు సమర్పణ



కృత్తివెన్ను అన్నసమారాధనలో భక్తులకు వడ్డిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: కృత్తివెన్నులోని దుర్గా పార్వతీసమేత నాగేశ్వరస్వామి వారి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ కృత్తివెన్ను శివాలయంలోని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మంత్రికి అధికారులు, చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు ఘనస్వాగతం పలికారు. అర్చకులు మురళీకృష్ణ పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా మంత్రి పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలో మంత్రి పాల్గొని భక్తులకు వడ్డించారు. స్వచ్ఛంద సంస్థలు, ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

గూడూరు: మండలంలోని కంకటావలో అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూడూరు ఎంపీపీ మధు, వైస్ ఎంపీపీ కుటుంబరావు, నాయకులు తలుపుల కృష్ణ, దుర్గారావు, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

ఉత్తర వాహినిలో భక్తుల పుణ్యస్నానాలు



పెదకళ్లేపల్లి కృష్ణానదిలో పితృ దేవతలకు పిండాలు వదులుతున్న వారసులు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీ పెదకళ్లేపల్లిలో కృష్ణానది జనసంద్రంగా మారింది. మహాశివరాత్రి సందర్భంగా శనివారం ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చారు. కృష్ణానది మూడు ఘాట్‌లు భక్తులతో నిండిపోయాయి. స్నానాలు చేసిన భక్తులు నది ఒడ్డున శివలింగం, ద్వాదశ జ్యోతిర్లింగ సహిత సహస్ర లింగేశ్వరస్వామి, అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరస్వామివార్లను దర్శించుకున్నారు. నది ఒడ్డున పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తున్న వారసులు, మరోపక్క పసుపు, కుంకుమలు, పూలు, పండ్లు, బియ్యంతో కూడిన చాటలను ముత్తైదువలకు వాయినాలు అందిస్తున్న మహిళలు, గంగిరెద్దుల సవ్వడులు, జంగమదేవరలు శంఖు నాదస్వరంతో దక్షిణకాశీ సందడిగా మారింది. దుర్గా నాగేశ్వరస్వామి వారి ఆలయం నుంచి కృష్ణానది వరకు రెండు కిలోమీటర్ల మేరకు రహదారి పొడవునా భక్తులతో నిండిపోయింది. అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో సీఐ జి. శ్రీనివాస్ 500 మంది పోలీసులతో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ కె. నవీన్ కుమార్, పంచాయతీ అధికారులు, మత్స్యశాఖ, అగ్నిమాపక సిబ్బంది సేవలు అందించారు.



కంకటావ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి జోగి రమేష్



ఎడ్లంకలో భక్తులకు మజ్జిగ, పులిహోర అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



కృత్తివెన్ను శివాలయం వద్ద అభిషేకాలు చేయించుకుంటున్న భక్తులు



పెడన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దంపతులు



ఎడ్లంకలో ప్రత్యేక ఆకర్షణగా ప్రభ

భక్తులతో పోటెత్తిన నాగులేరు తీరం



నాగులేరు వద్ద పోటెత్తిన భక్తులు



పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరస్వామి

మచిలీపట్నంటౌన్: బందరులోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలోని మహాశివుని విగ్రహం వద్ద విశేష పూజలు, మహామంగళ హారతులు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. గొడుగుపేట, గాంధీబొమ్మ, బచ్చుపేట, ఖొజ్జిల్లిపేట, శివగంగ, చింతగుంటపాలెం, జోడుగుళ్లు, అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం తదితర శివాలయాల్లో పూజలు చేశారు. చౌడేశ్వరి సహిత రామలింగేశ్వరస్వామి ఆలయంలో భాగవతారిణి పి. లక్ష్మీలీల పార్వతి కల్యాణం హరికథ కాలక్షేపం చేశారు. నాగులేరు కాలువ గట్టు భక్తులతో కిటకిటలాడింది. కాలువలో స్నానాలు ఆచరించిన అనంతరం పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న ఏడు ఘాట్లలో భక్తులు స్నానాలు ఆచరించారు. గట్టు వద్ద ఉన్న రసలింగేశ్వరస్వామి ఆలయానికి, నాగేశ్వరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకున్నారు. పెడనకు చెందిన బాలుడు ఇస్సాకు మహాత్మాగాంధీ వేషధారణలో యాచించారు. భక్తులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, పెరుగన్నం, వాటర్ ప్యాకెట్లు, శీతలపానీయాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ 32వ డివిజన్ కన్వీనర్లు చింతా మౌనిక, చీలి రవీంద్ర ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పొట్లాలు అందజేశారు.



పితృదేవతలకు పిండ ప్రదానాలు చేస్తున్న దృశ్యం

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు..

మచిలీపట్నం ఆర్టీసీ డిపో నుంచి పెదకళ్లేపల్లి, ఐలూరుకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఐలూరుకు 18 బస్సులు, పెదకళ్లేపల్లికి 21 బస్సులు మొత్తం 39 బస్సులను నడిపామని ఆర్టీసీ డీఎం టి. పెద్దిరాజు తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో కూడా సాధారణ చార్జీలను వసూలు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బంటుమిల్లి: ములపర్రు పంచాయతీ శివారు రామన్నమోడి గ్రామానికి చెందిన బొడ్డు ఏడుకొండలు (63) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడుకొండలుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరు ఉద్యోగాలు చేస్తూ బంటుమిల్లిలో నివాసం ఉంటున్నారు. భార్యకు అనారోగ్యంగా ఉండటంతో ఈ నెల 14వ తేదీన ఆమెను కుమార్తెల వద్ద దింపి ఏడుకొండలు స్వగ్రామం వెళ్లాడు. కుమార్తెలు తండ్రికి ఫోన్ చేస్తుంటే ఫోన్ తీయకపోవడంతో 17వ తేదీ రాత్రి రామన్నమోడి వెళ్లి చూడగా ఏడుకొండలు ఇంట్లో మృతిచెంది ఉన్నాడు. అప్పటికే ఏడుకొండలు శరీరం ఉబ్బిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మృతుడి చిన్న కుమార్తె బొడ్డు నాగకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ ఎ. పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆస్తిపన్ను వెంటనే చెల్లించండి

మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడటౌన్: పట్టణంలో ఆస్తిపన్ను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పురపాలక సంఘ పరిధిలోని ప్రతి ఒక్క రూ ఇంటి పన్ను, నీటి పన్ను, ఖాళీస్థలాల ప న్నులు వెంటనే చెల్లించాలన్నారు. సకాలంలో పన్ను చెల్లించకపోతే నూటికి రూ.2 చొప్పున అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందన్నా రు. అపరాధ రుసుం రద్దుకు ప్రభుత్వ ఆదేశాలు లేనందున వడ్డీరాయితీ ఆశించకుండా వెంటనే పన్ను చెల్లించాలని ఆయన సూచించారు.

నేడు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

పామర్రు(పమిడిముక్కల): మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ పాల్గొంటారన్నారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమాలకు నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీనాయకులు, కార్యకర్తలు అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

కనుల పండువగా జగజ్జ్యోతి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో జగజ్జ్యోతి కార్యక్రమం శనివారం రాత్రి కన్నులపండువగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రమిదలో ఆలయ అనువంశిక ధర్మకర్త యార్లగడ్డ పద్మనాభప్రసాద్, చల్లపల్లి రాజ వంశీకులు జగజ్జ్యోతిని వెలిగించారు. ఆలయ ఏసీ ఎన్ సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు శంకరమంచి భాస్కర విజయ కుమార్, బుద్దు నాగవరప్రసాద్ బ్రహ్మత్వంలో శనివారం తెల్లవారుజాము 2 గంటలకు శ్రీస్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్లకు సహస్ర నామార్చనలు నిర్వహించి తెల్లవారుజాము నుంచే స్వామి వారి, అమ్మవార్ల దర్శనం భక్తులకు కల్పించారు. రాత్రి 7 గంటలకు కన్నులపండువగా జగజ్జ్యోతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు జగజ్జ్యోతిని దర్శించుకుని స్వామివార్లకు పూజలు చేశారు. ఆలయ అధికారులు గుమ్మడి వెంకటేశ్వరరావు, చెన్నకేశవ, వెంకటరమణ పర్యవేక్షించారు.



జగజ్జ్యోతిని వెలిగిస్తున్న అనువంశిక ధర్మకర్త పద్మనాభప్రసాద్, రాజవంశీకులు

వరాహాల వరుస మృతిపై ఆందోళన

పెడన: పట్టణంలో పందులు పెద్ద సంఖ్యలో మృతి చెందుతున్నాయి. దీనిపై పట్టణ వాసులు, పెంపకందారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పందులను పట్టణానికి దూరంగా తరలించాలని కొన్ని నెలలుగా పురపాలక శాఖాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. ఇటీవల జిల్లా రెవెన్యూ అధికారి కూడా పెంపకందారులతో సమావేశం నిర్వహించి వారికి హెచ్చరికలు జారీ చేశారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. తాజాగా పందులు అధిక సంఖ్యలో మృతి చెందుతుండటంపై పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా వ్యాధితో మృత్యువాతపడుతున్నాయా అని పెంపకందారులు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై పెడన పురపాలక సంఘం కమిషనర్ ఎం. అంజయ్య స్పందిస్తూ పందులు చనిపోతున్న విషయం వాస్తవమేనన్నారు. పశు వైద్యాధికారులకు ఈ విషయాన్ని తెలియజేసి మృతిచెందిన పందులకు పోస్టుమార్టం చేయిస్తామని చెప్పారు.

జగనన్నను ఆశీర్వదించండి

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 24వ డివిజన్‌లో రెండో రోజు శనివారం నిర్వహించారు. కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, డివిజన్ ఇన్‌చార్జి చిత్తజల్లు రాజుతో కలిసి గడప గడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నవరత్న పథకాలతో పాటు సంక్షేమ పథకాలను గడప గడపకు అందించారని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బలగం విజయశేఖర్, ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాగం ధర్మరాజు, డివిజన్ కన్వీనర్ కొణతం వీరనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నే శేషారావు, మేకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్లు పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు, కొత్తపేట కాపురస్తులు 1) యాదంరెడ్డి వెంకట సత్యవతి W/o. సాంబమూర్తి మరియు తెలంగాణా రాష్ట్రం, హైదరాబాద్‌లోని సైనిక్‌పురి లేక్‌వ్యూ రెసిడెన్సీ కాపురస్తులు 2) బాయిశెట్టి లక్ష్మీప్రవీణ W/o. సాయిసందీప్ గార్ల సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్లు కృష్ణాజిల్లా, బందరు మండలం, పెడన స॥రి॥ అరిశేపల్లి గ్రామంలోని ఆస్తి తాలూకు దస్తావేజు నెం. 753/2018, 754/ 2018 ర్లుగా హసీనాసుల్తానా అనే నయీమా సుల్తానా W/o. అబ్దుల్ ఖయ్యూం బళ్లారి జిల్లా, దేవీనగర్, కర్నాటక రాష్ట్రం వారి వద్ద నుండి అరిశేపల్లి గ్రామంలో కొనుగోలు చేసిన ఆస్తికి సంబంధించిన లింకు దస్తావేజు నెం. 1292/ 1993, 1293/1993 ర్లు గల ఒరిజినల్స్ పోయినవి. దొరికినవారు నాకు గానీ లేదా పాలకొల్లు SBI మెయిన్ బ్రాంచి నందుగానీ అందజేయగలరు. ఎవరైనా ఆ ట్టి దస్తావేజులపై ఎటువంటి లావాదేవీలు జరిపినా అవి చెల్లనేరవని మరియు అట్టివారు నా క్లయింట్లు తీసుకొనే సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

గొడుగుపేట, మచిలీపట్నం — పసుమర్తి సూర్యప్రకాష్, న్యాయవాది, ఫోన్ : 98661 27503

ప్రత్యేక పూజలు, అభిషేకాలు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి శ్రీకాకుళంలో ఏకరాతి ప్రసన్న మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఘంటసాల బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చావలి కృష్ణకిషోర్ స్వామివారికి పూజలు చేశారు.

- చల్లపల్లి: ప్రాచీన పుట్టతీర్థం యార్లగడ్డ నాగమల్లి కోటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల రైతులు, పశు పోషకులు తమ గేదెలు, ఆవులు, ఎడ్లు, మేకల మందలు, గొర్రెల మందలను తోలుకుని వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. మహిళలు నైవేద్యాలు వండి స్వామివారికి సమర్పించారు. నాగపుట్టలో పాలుపోసి, పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ పర్యవేక్షించారు.

530 మందికి వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు, రోగ నిరోధక శక్తి పెరుగుదలకు ఆయుర్వేదం ఎంతో మేలు అని ప్రముఖ పారిశ్రామిక వేత్త, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ పుట్టగుంట సతీష్‌కుమార్ అన్నారు. పెరికీడులో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్, కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. 530 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్

99122 20543, 79950 92116 (మచిలీపట్నం, పెడన)

99122 20545 (అవనిగడ్డ)

Office mail : sakshiads@gmail.com